క్లుప్తంగా

తల్లిదండ్రులను గౌరవించాలి



మాట్లాడుతున్న నారాయణ్ మహరాజ్

ఇచ్చోడ: తల్లిదండ్రులను గౌరవించాలని సంత్ వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో 1023వ సత్‌సంగ్‌లో పాల్గొని ప్రవచనలు చేశారు. ప్రసుతం ప్రతి ఒక్కరూ యాంత్రీకరణ జీవితానికి అలవాటు పడ్డారని అన్నారు. మనిషి జీవించేందుకు డబ్బు అవసరమే కానీ డబ్బుతో మనుషుల జీవితాలను ముడిపెట్టవద్దన్నారు.

ఘనంగా హీరసుక జయంతి



పాల్గొన్న పర్ధాన్ సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి: గోండి ధర్మగురు హీరసుక జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో ఘనంగా నిర్వహించారు. పర్ధాన్‌గూడ గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో హీరసుక స్మారక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖడే ఉత్తం, ఆర్క పుష్పలత, కుమ్ర రఘురాం, మడావి విశ్వనాథ్, కుమ్ర భీంరావ్ పాల్గొన్నారు.

భక్తిమార్గంలో పయనించాలి



హోమంలో పాల్గొన్న లింబాజీ మహరాజ్

బోథ్: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలని కై లాస్ టెకిడి లింబాజీ మహరాజ్ అన్నారు. ఆదివారం సొనాల మండలంలోని ఘన్‌పూర్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ప్రత్యేక చేసి, భోగ్ బండార్ నిర్వహించారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో ప్రచారం



ప్రచారం చేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆదివారం మార్నింగ్ వాక్‌లో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి అశోక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు కిష్టన్న, అశోక్, సూర్యకుమార్, విలాస్‌రావు, గౌస్ మొయినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న దగ్ధం

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగడంతో మొక్కజొన్న పంట దగ్ధమైంది. కనుగుట్ట గ్రామానికి చెందిన తోట లింగయ్య చేనులో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగాయి. దాదాపు ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న పంట కాలిపోయినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సాలెగూడలో తాగునీటి గోస

- పని చేయని నీటి పథకాలు
- సరఫరా కాని భగీరథ నీరు
- గ్రామస్తులకు తప్పని తిప్పలు



నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్



బోర్‌బావి వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు



ఎడ్లబండి ద్వారా నీటిని సేకరిస్తున్న రాధాబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని తెజాపూర్ పరిధిలోని సాలెగూడ గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. వేసవి ప్రారంభం కాక ముందే గ్రామస్తులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీరు 15 రోజులకు ఒకసారి సరఫరా కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న బోరుబావి వద్ద గంటలు వేచి ఉండి ఎడ్ల బండ్ల సహాయంతో నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరం కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎడ్లబండ్లు, బైక్‌లపైనే..

సాలెగూడ గ్రామంలో 90 ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయి. సుమారు 650 మంది జనాభా నివాసం ఉంటున్నారు. భూగర్భజలాలు తగ్గడంతో బోరు బావులు వేసిన నీరు పడడం లేదు. 2013 నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 9 బోర్లు వేశారు. కానీ ఎక్కడా కూడా నీరు పడలేదు. మంచి నీటి పథకాలు జనవరి వరకే ఉపయోగంలో ఉంటాయని, తరువాత నీరు రావని గ్రామస్తులు వాపోతున్నారు., మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంతో 15 రోజులకు ఒకసారి మాత్రం నీరు సరఫరా అవుతుందన్నారు. వాహనాలు, ఎడ్లబండ్లు లేనివారు బిందేలతో నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఏడాది ఇదే గోస



గ్రామంలో ఉన్న నీటి పథకాలు పని చేయడం లేదు. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ప్రతీ సంవత్సరం తాగునీటి కోసం గోస పడుతున్నాం. దూరంలో ఉన్న బోరు బావి వద్ద గంటలు వేసి ఉండి ఎడ్ల బండ్లతో నీటిని తీసుకొచ్చి ఇబ్బందులకు గురవుతున్నాం. తాగునీటి కోసం చాలా అవస్థలు పడుతున్నాం. – రాధాబాయి, సాలెగూడ

సమయం వృథా



వ్యవసాయ పనులు మానేసి దినమంతా తాగునీటి కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ప్రతీ రోజు గ్రామానికి దూరంలో ఉన్న బోరు బావి వద్ద గంటల తరబడి వేచి ఉండి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు దృష్టి సారించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– కోవ రాము, సాలెగూడ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్‌తో పాటు ఆయన అనుచరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై చేస్తున్న అరాచకాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జాదవ్ గణేష్, నానక్ సింగ్, గులాబ్ సింగ్, గులాబ్, పవన్, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆది వారం గ్రామస్తులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ.. గుండివాగు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గ్రా మస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేఎస్ రెడ్డి

ఎదులాపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కేఎస్ రెడ్డి, రీజినల్ కార్యదర్శి భీం రావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆది వారం యూనియన్ రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సంస్థలో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మరోవైపు కిలోమీటర్ల పెంపు, ఓటీల తగ్గింపు, డిపోలలో సరిపోయినంత కార్మికులు లేక ఇబ్బందులు అధికమవుతున్నాయన్నారు. అదేవిధంగా సంస్థలో యూనియన్లను సైతం అనుమతించకపోవడంతో కార్మికులు ఆర్థిక ప్రయోజనాలు సైతం కోల్పోతున్నారన్నారు. అన్ని రీజీయన్లలో పర్యటించి కార్మికులను చైతన్య పరచాలనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిపో యూనియన్ డిపో అధ్యక్షుడు అశోక్, సురేశ్, నారాయణ, దత్తు, అనిల్ కుమార్, వెంకటేశ్, దేవన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చలి బోనాల సందడి



పూజలు చేస్తున్న భక్తులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట, పాత ఉట్నూర్ గ్రామాల్లో గ్రామస్తులు ఆదివారం పోచమ్మ ఆలయంలో చలి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ ఏటా శివరాత్రికి ముందు చలి బోనాలు సమర్పించడం తరతరాల నుంచి ఆనవాయితీగా వస్తుంది. తమ ఊరు కుటుంబంలో అందరు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో ఉండాలని చలి బోనాలతో పోచమ్మను మొక్కుకున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందిన వారు గెలుపుకోసం ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని ఆదిలాబాద్‌రూరల్ మండలంలో గల బెల్లూరి మైదానంలో జోగు ఆశన్న- భోజమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు యూనుస్, సాజిదొద్దీన్, బట్టు సతీష్, వినోద్, క్రీడా నిర్వాహకులు అయ్యుబ్ ఖాన్, అద్నాన్, జమీల్, ఓంప్రకాష్, శ్రావణ్, నానీ, రషీద్ ఖాన్, అఫ్సర్ పాల్గొన్నారు.

హీరాసుక జయంతిని విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ పెద్దలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ తెగకు చెందిన కులస్తులు ఐక్యమత్యంగా ఉండి కులదైవం హీరాసుక జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కులపెద్దలు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్త కుమ్మర్‌వాడలో జయంతి వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కుల పెద్దలు మాట్లాడుతూ ఈనెల 23న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ పర్ధాన్ తెగకు చెందిన ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. జయంతి వేడుకలను విజయవంతం చేసేలా కుల పెద్దలు, యువకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలి’



ప్రచారం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

తాంసి: పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అశోక్ కోరారు. ఆదివారం మండలంలోని జామిడి గ్రామంలో నరేందర్ రెడ్డి గెలిపించాలని పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేశ్, సంతోశ్, విశ్వక్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌక్ ప్రాంతంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ఇసాఖ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని షాద్‌నగర్‌కు చెందిన ముజీబ్ ఖాన్ బైక్‌పై కలెక్టర్ చౌక్ నుంచి షాద్‌నగర్‌కు వెళ్తున్న క్రమంలో కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

పంటల బీమా అమలు చేసేదెప్పుడో?

- ఎటూ తేల్చని కాంగ్రెస్ సర్కార్
- బీమా పథకాన్ని ఆపేసిన గత ప్రభుత్వం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

బోథ్: రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడంతో పంట నష్టానికి పరిహారం అందడం లేదు. అధిక వర్షాలకు పంటలు నష్టపోతే పంటల బీమా రైతులను ఆదుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. గత రెండు సంవత్సరాల నుంచి అధిక వర్షాలతో జిల్లాలోని చాలా మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా నుంచి వైదొలగడంతో రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి పంటల బీమా పథకం ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులు పంట నష్టపోతే వారికి బీమా కల్పించి పరిహారాన్ని అందించేలా పథకాన్ని అమలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో రైతుల పంటలకు బీమా ప్రీమియంను చెల్లిస్తుంది. దీంతో రైతుల పంట నష్టం జరిగితే బీమా ద్వారా పరిహారం అందుతుంది. రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడంతో ఐదేళ్ల నుంచి పంటలు నష్టపోతే రైతులకు పరిహారం అందడం లేదు.

రైతులకు తీవ్ర నష్టం..

పంటల బీమా లేకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. అధిక వర్షాలతో పంట నష్టం జరిగితే ఆదుకునే పథకం రాష్ట్రంలో లేకపోవడంతో పరిహారం అందడం లేదు. ప్రభుత్వం సైతం రై తులు నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వడం లేదు. పంటల బీమా లేని రాష్ట్రంగా తెలంగాణ మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో కొత్త పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు. గత ఆరేళ్లుగా పంటల బీమా పథకం రాష్ట్రంలో లేకపోవడంతో తాము అధికారంలోకి వస్తే × పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పంటల బీమా తీసుకోస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరుతుందా? చేరదా? అనేది ప్రశ్నగా మిగిలింది.

పంటల బీమా ప్రవేశపెట్టాలి



రాష్ట్రంలో పంటల బీమాను ప్రవేశపెట్టాలి. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బీమా లేకపోవడంతో రైతులు నష్టపోయారు. అధిక వర్షాల వల్ల పంట నష్టం జరిగితే, వారికి పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు రాష్ట్ర వాటాను చెల్లించకపోవడంతో రైతులు నష్టపోయారు.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

రైతులకు ఆసరాగా..



పంటల బీమా ఉంటే పంట నష్టపోయిన రైతులకు ఆసరాగా ఉంటుంది. పంట పరిహారం అందుతుంది. గత రెండేళ్లుగా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు నష్టోయారు. ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందించ లేదు. పంటల బీమా ఉంటే ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా పరిహారం అందుకునే వీలు ఉంటుంది.

– సోమ శంకర్, రైతు, బోథ్

సీవోఈ పరీక్ష పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న ఆర్సీవో

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లాల్‌టేకిడిలో ప్రభుత్వ గిరిన గురుకుల జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స (సీవోఈ) పరీక్ష కేంద్రాన్ని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అగస్టియన్ పరిశీలించారు.

ఇచ్చోడ: మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 256 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 239 మంది హాజరైనట్లు సీఎస్ రాగి గోవర్ధన్ తెలిపారు.

కాడెడ్ల విక్రయం

తాంసి: ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగియడంతో పాటు కాడెడ్ల అవసరం అంతగా లేకపోవడంతో రైతులు కాడెడ్లను పోషించలేక విక్రయిస్తున్నారు. పశుపోషణ భారంగా మారడంతో పాటు పశుగ్రాసం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వహించే ఎద్దుల సంతకు తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన రైతులు కాడెడ్లను విక్రయించేందుకు పెద్ద మొత్తంలో తీసుకెళ్లారు.

మొక్కలు నాటి.. సెల్ఫీ దిగి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో ఆదివారం మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో ఐదు వందల మొక్కలు నాటి సెల్ఫీ దిగారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టి కర్త మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపెల్లి సంతోష్ కుమార్ గారి వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటినట్లు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన వివాహిత ఎన్నవార్ కవిత ఈనెల 13న ఉదయం 11 గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణుప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

- ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అర్లి(బి) గ్రామానికి చెందిన చుక్కబొట్ల రాజు అదృశ్యమయ్యాడు. మహరాష్ట్రలోని యవత్మాల్ ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి ఆదివారం ఉదయం రైల్వేస్టేషన్‌లో బైక్ పార్కింగ్ చేసి వెళ్లి పోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో భార్య కళ్యాణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ఆశన్న ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ ఊషన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

అ‘పూర్వ’ కలయిక

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు





గురువులతో పూర్వ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్/బేల/ తాంసి: ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల 1999–2000, బేల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 2001–02, భీంపూర్ మండలం అర్లి(టి) జెడ్పీ ఉన్నత పాఠశాల 2005–06 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం ఆయా పాఠశాలల్లో కలుసుకున్నారు. విద్యార్థులు, గురువులు ఒకే వేదికపై కలిసి చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.